
ఈనాడు
నిజామాబాద్

శుక్రవారం అక్టోబరు 4, 2024 III





'ఇటీవల కామారెడ్డి కోర్టులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడు గతంలో మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. అతడి ముఖంలో ఏనాడు చిరునవ్వు లేదు. మనసు ఆందోళనకు గురై తప్పు చేశారు. తల్లినే పొట్టనబెట్టుకున్నారు. జీవితంలో ఆనందానికి చోటివ్వకపోవడం, మద్యానికి బానిసవ్వడంతో కుటుంబమే ఛిన్నాభిన్నమైంది.'

'కామారెడ్డి జిల్లాకేంద్రంలోని రాజీవ్ ఉద్యానంలో ఉదయం పూట వాకర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నడక సాగిస్తారు. అనంతరం పావుగంట నవ్వడానికి సమయం కేటాయిస్తారు. తద్వారా నడకకు వచ్చిన వారి మనసు మరింత తేలికవుతుంది. 30 మందిలో 28 మంది సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉన్నారు. రక్తపోటు, మధుమేహం వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తపడుతున్నారు.'

నవ్వేద్దాం.. జీవిద్దాం

◆ ఒత్తిడిని దూరం చేస్తేనే ఆరోగ్యం
◆ నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వలేకపోవడం ఒక రోగం అన్నాడో సినీ కవి.

నవ్వు నలభై విధాల మేలు అనేది నేటి మాట. మన ముఖంలో నవ్వు కనబడాలంటే 32 కండరాలు కదలాలి. ముఖానికి వ్యాయామంలా నవ్వు ఉపయోగపడుతుంది. మొత్తం జీవరాశుల్లో నవ్వు మనుషులకు లభించిన వరం. ఈ రోజుల్లో అనేక మంది ఒత్తిడిబారిన పడి అనేక అనారోగ్యాల పాలవుతున్నారు. ఎప్పటికప్పుడు ఆందోళనను తరిమేస్తే మనసు ప్రశాంతంగా మారుతుంది. ఏటా అక్టోబరులో మొదటి శుక్రవారాన్ని నవ్వుల దినోత్సవంగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా కథనం.



'నిజాయతీగా ఉండేందుకు ప్రయత్నించండి. ఒక వ్యక్తి నవ్వడానికి సహాయం చేయండి.'
- ఇది 2024 ప్రపంచ నవ్వుల దినోత్సవ థీమ్

మానసిక ఉల్లాసానికి దోహదం

మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే రోజు కనీసం గంటసేపైనా నవ్వాలని ఇటీవల అధ్యయనాలు చెబుతున్నాయి. ఎలాంటి ఒత్తిడి అయినా నవ్వుతోనే తొలగిపోతుంది. మరొకరిని నవ్వించడానికి కారణమైనప్పుడు రెట్టింపు ఆనందాన్ని పొందగలుగుతారు. ఆనందంగా ఉన్నప్పుడు మెదడు నుంచి ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. చిరునవ్వును ప్రేరేపించడానికి ముఖ కండరాలకు న్యూరోనల్స్ అనేవి సంకేతాలు అందిస్తాయి. నవ్వుతున్న కండరాలు సంకోచించినప్పుడు అవి తిరిగి మెదడుకు ఒక సంకేతాన్ని పంపుతాయి. మనిషిని ఉత్తేజపరుస్తాయి.

ఒనగూరే ప్రయోజనాలు

● తరచూ నవ్వుతూ ఉండటం ద్వారా ఒత్తిడి తగ్గి రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుంది.
● సహనం పెరుగుతుంది.
● హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
● చిరునవ్వుతో సహజ నొప్పులను దూరం చేస్తుంది. సెరటోనిన్ అనే హార్మోన్ విడుదలై నొప్పి నియంత్రణకు సాయపడుతుంది.
● యవ్వనంగా మరింత ఆకర్షణీయంగా ఉండేందుకు నవ్వు దోహదం చేస్తుంది. ఎదుటి వారితో నమ్మకం బలపడుతుంది.



బీపీని తగ్గిస్తుంది

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.60 లక్షల మంది రక్తపోటుతో, 1.80 లక్షల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అనుక్షణం ఒత్తిళ్లు.. మానసిక ఆందోళన.. భయం భయంగా బతకడం వంటి చర్యలతో మరింత కుంగిపోతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు నవ్వడం ఒకటే పరిష్కారమని వైద్యులు చెబుతున్నారు. నవ్వుతో రక్తపోటు, మధుమేహం నుంచి కాపాడుకోవచ్చు. నవ్వడం ముఖానికి వ్యాయామంలా ఉపయోగపడుతుందని కామారెడ్డికి చెందిన ఫిజీషియన్ డా.పవన్ పేర్కొన్నారు.




ప్రశస్త్‌.. దివ్యమైన యాప్‌!

☛ విద్యార్థుల మానసిక, శారీరక సమస్యల గుర్తింపు

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లోని విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు. ఎక్కువ మందిలో వైకల్యం కనిపించేలా ఉండవు. ఇలాంటి వారిని గుర్తించడానికి నూతన విద్యావిధానానికి అనుకూలంగా ఎన్‌సీఈఆర్‌టీ ప్రశస్త్(ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. గత నెల 27 నుంచి ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో సర్వే ప్రారంభమైంది.



ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

నమోదు ఇలా...

● ప్రశస్త్ యాప్‌ను ఉపాధ్యాయులంతా తమ చరవాణుల్లోని ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
● ప్రధానోపాధ్యాయులు పాఠశాల మెయిల్ ద్వారా, ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ అవ్వాలి.
● విద్యార్థులను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
● సర్వే పూర్తయిన తర్వాత విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచాలి.
● ఉపాధ్యాయులు సర్వేను పూర్తి చేసిన తర్వాత స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ (ఐఈఆర్‌పీ) మరోసారి సర్వే చేస్తారు.

పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
నిజామాబాద్	789	137	269	1,42,560
కామారెడ్డి	548	226	186	1,20.430

సర్వేలో పరిశీలించే అంశాలు

● విద్యార్థి ఎలా మాట్లాడుతున్నాడు
● సరిగా చదవగలుగుతున్నాడా?
● ఎలా రాస్తున్నాడు
● హోం వర్క్ సరిగా చేస్తున్నాడా?
● తరగతి గదిలో విద్యార్థి ప్రవర్తన
● ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తున్నాడా? ● కాళ్లు, చేతులు, తల, పొడవు, పొట్టి, చేతి వేళ్లు మొదలైన అవయవాలకు సంబంధించిన వివరాలు ● చూపు ఎలా ఉంది రంగులను గుర్తిస్తున్నాడా...నల్లబల్ల సరిగా కనిపిస్తుందా, గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? అనే వివరాలు పరిశీలిస్తారు.
● విద్యార్థుల్లో వైకల్యాలను గుర్తించి దానికి తగిన చికిత్స అందించనున్నారు.
● సదరం ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తారు. తరగతుల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అందేలా చూస్తారు. దివ్యాంగుల తల్లిదండ్రులకు బ్యాంకు రుణాలు అందిస్తారు

త్వరలో పూర్తి చేస్తాం

...శ్రీనివాసురావు జిల్లా సమన్వయకర్త నిజామాబాద్



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యాశాఖ సూచించిన ప్రశ్నల ఆధారంగా యాప్‌లో విద్యార్థుల వైకల్యాలను ఉపాధ్యాయులు గుర్తించి నమోదు చేయాలి. సర్వేను త్వరలో పూర్తి చేయాల్సి ఉంటుంది. మళ్లీ ఐఈఆర్‌పీలు సర్వేను పూర్తి చేసి గుర్తించిన వైకల్యాల ఆధారంగా వారికి చికిత్స అందిస్తారు. ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు.

సభ్యత్వ నమోదు చేయించాలి

కోటగిరి, న్యూస్‌టుడే : లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. గురువారం కోటగిరిలో పర్యటించి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యకర్తలకు ఇచ్చిన లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నవీన్, నాయకులు రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యెండల

ప్రతిగింజ కొనుగోలు చేస్తాం

సాలూర, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతిగింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కల్దుర్కిలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఛైర్మన్ మార గంగారెడ్డితో కలిసి సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రైతు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని కోరారు. కల్దుర్కి జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంఈవో నాగయ్య ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, ఏఎంసీ ఛైర్మన్ సంధ్యారాణి, వైస్ ఛైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తూకం వేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

తెలంగాణ సంస్కృతి బతుకమ్మ

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్సు భవనంలో గురువారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి మూలం బతుకమ్మ పండుగ అన్నారు. బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో నీరు స్వచ్ఛంగా మారుతుందన్నారు. మహిళా సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక, ప్రిన్సిపల్ ఆరతి, కంట్రోలర్ ఆచార్య అరుణ, మహిళ ఉద్యోగులు, విద్యార్థినిలు, సిబ్బంది పాల్గొన్నారు.



తెవివిలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

'ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు'

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగరంలో ప్రతి డివిజన్‌కు నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ కింద రూ.10 లక్షలు మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని 16, 20వ డివిజన్‌ల పరిధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించి మాట్లాడారు. కంఠేశ్వర్ బ్యాంక్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, 20, 16 డివిజన్‌ల కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, భాజపా నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్ నీతూకిరణ్

న్యాయవాదుల నిరసన

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన న్యాయవాదిపై పోలీసుల భౌతిక దాడిని నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట గురువారం దిష్టిబొమ్మ దహనం చేశారు. అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పరుచూరి శ్రీధర్, ఎర్రం గణపతి, భాస్కర్, మద్దెపల్లి శంకర్ దాడిని ఖండించారు. రెండు రోజులు విధులకు దూరంగా ఉండాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. న్యాయవాదులు మధుసూదన్‌రావు, రవీందర్, విశ్వక్సేన్, ఆశ నారాయణ, రాజు, భానుచందర్, వెంకటేష్, నగేష్, వసంతరావు, ఇంతియాజ్, మోబిన్, భాస్కర్, బాల్‌రాజ్, కవితారెడ్డి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్నందున దారి మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు పాత కలెక్టరేట్‌లో బహిరంగ సభ ఉన్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు.

● నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్లే బస్సులు ఫ్లై ఓవర్, శ్రద్ధానంద్ గంజ్, అర్సపల్లి మీదుగా వెళ్లాలి.
● బోధన్ నుంచి నిజామాబాద్ వచ్చే బస్సులు అర్సపల్లి నుంచి కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా బస్టాండుకు చేరుకోవాలి.
● బోధన్ వైపు వెళ్లే భారీ వాహనాలు మాధవనగర్, కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలి.
● బాన్సువాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు వర్ని చౌరస్తా, ఖిల్లా రోడ్డు, బోధన్ బస్టాండు, అర్సపల్లి ఎక్స్ రోడ్డు, కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, మాధవనగర్ వైపు మళ్లాలి.

సర్వే పరిశీలన

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థ పరిధిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పనితీరును గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 38వ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టును కమిషనర్ మకరందు, మేయర్ నీతూకిరణ్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ ఇంటింటి సర్వే తీరును ఆకస్మికంగా పరిశీలించారు.



వివరాలు తెలుసుకుంటున్న నగరపాలకసంస్థ కమిషనర్ మకరందు

బోధన్, న్యూస్‌టుడే : బోధన్ పట్టణం, మండలంలో కుటుంబ డిజిటల్ సర్వేను సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. లంగ్డాపూర్, పట్టణంలో 25వ వార్డును సర్వేకు ఎంపిక చేశారు. ఈ మేరకు అక్కడ నియమించిన సిబ్బంది సర్వేలో సేకరిస్తున్న వివరాలు, ఇతరత్రా అంశాలను పరిశీలించారు. నిర్దేశిత నమూనాలో సమాచారం సేకరించాలని సూచించారు. పుర ఛైర్‌పర్సన్ పద్మ, కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.



న్యాల్కల్‌రోడ్‌రోడ్డులో..



డిచ్‌పల్లిలో..



సాలూరలో..



నవీపేట: మార్కండేయ ఆలయంలో..



వర్నిలో..

కొలువుదీరిన దుర్గమ్మ

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్ల విగ్రహాలను కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపుగా మండపాలకు తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలు గురువారం ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య కొనసాగిన పూజలు, ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు.

న్యూస్‌టుడే బృందం



చిన్నవాల్గోట్‌లో..



ఇందల్‌వాయి రామాలయంలో స్వాములు



జానకంపేటలో..



బోధన్ చక్రేశ్వర ఆలయంలో



జక్రాన్‌పల్లి : కొలిప్యాక్‌లో..



ధర్పల్లిలో మంగళహారతులతో ఊరేగింపు



శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో..



దేవిరోడ్‌లోని దేవిమాత ఆలయంలో..

పూల సింగిడి.. యువతుల సందడి

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఉన్నత చదువుల కోసం ఎక్కడున్నా బతుకమ్మ పండగొచ్చిందంటే ఇందూరు యువతులు ఇళ్లకు చేరుతారు. చరవాణులు పక్కనబెట్టి ఈ తొమ్మిది రోజులు ఉత్సవాల్లో పాల్గొంటారు. స్వయంగా పూలు సేకరించడం మొదలుకొని.. అందరికంటే ముందే బతుకమ్మ పేర్చడంలో పోటీపడతారు. మిగతా యువతుల కంటే భిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకుంటారు. అంతా కలిసి అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడుతూ ఆటలు ఆడుతారు.. వివిధ ప్రాంతాల్లో చదువుతూ పండగకు స్వగ్రామానికి చేరుకున్న యువతులు తమ మనోగతం 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



తయారు చేసిన బతుకమ్మలతో విద్యార్థినులు

బృందంగా ఏర్పడ్డాం

- భార్గవి, డిగ్రీ ఫైనల్, నిజామాబాద్



రెండో తరగతి నుంచే ఇష్టం పెంచుకున్నా. అమ్మ నుంచి బతుకమ్మ ఎలా పేర్చాలో నేర్చుకున్నా. గునుగ పూలకు రంగులు అద్దడం, అందరికంటే భిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకుంటా. మా కాలనీ స్నేహితురాళ్లతో కలిసి బృందంగా ఏర్పడ్డాం. అందరం కలిసి ఉత్సవాలు సరదాగా జరుపుకొంటాం.

భిన్నంగా ఆలోచిస్తా

- శివానీ, నిజామాబాద్



తొమ్మిది వరుసల్లో బతుకమ్మ పేర్చడంలో అందరికంటే భిన్నంగా ఆలోచిస్తా. పూలశిఖరంగా రూపొందించి తమలపాకుపై పసుపుతో తయారుచేసిన గౌరమ్మను పూజించేందుకు నియమ నిష్ఠతో దీక్ష చేస్తా. ఎక్కడున్నా, ఏ హోదాలో ఉన్నా పూల పండగను మరిచిపోను.

నా పాటలు ఉండాల్సిందే..

- జాగృతి, డిగ్రీ ద్వితీయ, నిజామాబాద్



అక్క, నేను చిన్నప్పటి నుంచి వేడుకల్లో ముందుంటాం. అమ్మ శివలీల ద్వారా పాటలు నేర్చుకున్నాం. శ్రీలక్ష్మి.. నీ మహిమలు బతుకమ్మ తదితర ఐదు పాటలు పాడుతా. మా కాలనీలో నా పాటలు తప్పకుండా ఉండాల్సిందే. డీజే పాటలు కాకుండా సొంతంగా ఆలపించేందుకే మేమంతా ఇష్టపడుతాం.

అనుబంధం ఏర్పడుతుంది

- లిఖిత, లక్ష్మాపూర్, నిజామాబాద్ గ్రామీణం



నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చదివే స్నేహితులం బతుకమ్మ వచ్చిందంటే ఇంటికి వచ్చేస్తాం. అందరం పాటలు పాడుతూ, కలిసి చప్పట్లు కొడుతూ ఆడుతుంటే కొత్త అనుబంధం పెనవేసుకుంటుంది. మన సంస్కృతికి గౌరవం ఇచ్చినప్పుడే భారత దేశ గొప్పతనం ఇతరులకు తెలుస్తుంది.

పది కేంద్రాల్లో సోయా కొనుగోళ్లు

నిజామాబాద్ వ్యవసాయం : వానాకాలం సీజన్‌లో పండిన సోయా పంటను పది కేంద్రాల్లో కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే వేల్పూర్, సాలూర గ్రామాల్లో తెరిచామని, త్వరలో ఇతర ప్రాంతాల్లోనూ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.4,892 చెల్లిస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నిజామాబాద్ వ్యవసాయం : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ దడువాయి నూతన కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గౌడ్, కోశాధికారిగా ఉమేశ్ ప్రమాణం స్వీకారం చేయగా ఐఎన్‌టీయూసీ నాయకులు వారిని సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీక్ ఖాన్, గోవర్ధన్, అశోక్ హాజరయ్యారు.

35 మంది గైర్హాజరు

నిజామాబాద్ విద్యావిభాగం : నిజామాబాద్ ఆదర్శ హిందీ విద్యాలయంలో గురువారం ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా 35 మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. పదో తరగతి తెలుగులో 52 మందికి 41, ఇంటర్ తెలుగుపరీక్షకు 81కి 57 మంది, అరబిక్ పరీక్షకు ముగ్గురికి ముగ్గురు హాజరయ్యారు.

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఖలీల్‌వాడి : తెవివి క్యాంపస్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి పాపయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రెండు చక్కెర పరిశ్రమలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భూమయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్ గ్రామీణం : మాక్లూర్ మండలం మామిడిపల్లి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆలూర్ మండలం గుత్పకు చెందిన ప్రసాద్(36) నిజామాబాద్‌లోని ఓ అల్పాహార కేంద్రంలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మామిడిపల్లి వద్ద జాతీయరహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉన్న సరకు రవాణా వాహనాన్ని ఢీకొన్నాడు. తీవ్రగాయాలై ఆయన మృతి చెందగా.. అతడి సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొదుపు సొమ్ము దారి మళ్లింపు

బోధన్ గ్రామీణం : చిరువ్యాపారులు, పేదలు రోజూవారీగా పొదుపు చేసుకున్న సొమ్మును ప్రైవేటు బ్యాంకు మిత్ర దారి మళ్లించిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుంది. దాదాపు 15-20 మంది ఈఘటనలో రూ.లక్షల్లో నష్టపోయినట్లు సమాచారం. పట్టణంలోని ప్రైవేటు బ్యాంకులో ఉన్న రోజూవారీగా ఆదా పథకంలో పలువురు చేరారు. వీరిలో ముఖ్యంగా చిరు వ్యాపారులు ఉన్నారు. వారి వ్యాపార కేంద్రం నుంచి మిత్ర నిత్యం ఆదా సొమ్ము వసూలు చేసి వారి వద్ద ఉన్న పుస్తకంలో నమోదు చేసేవాడు. కానీ సొమ్మును వారి ఖాతాలో జమ చేయకుండా దారి మళ్లించాడు. అవసరాలకు అక్కరకొస్తుందని దాచుకున్న సొమ్ముపై ఆరా తీయగా అసలు ఖాతాలోనే జమ కాలేదని తేలింది. దీంతో నిలదీయగా చెల్లిస్తానని మిత్ర హామీ ఇచ్చి ముఖం చాటేయడంతో ఖాతాదారులు బ్యాంకు అధికారులను ఆశ్రయించగా, పోలీసులకు ఫిర్యాదుచేయాలని సలహా ఇచ్చినట్లు తెలిసింది.

ఈనాడు
నిజామాబాద్
శుక్రవారం అక్టోబరు 4, 2024



సహస్ర కమలలోచని

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారిని వెయ్యి కమలాలతో ఇలా అలంకరించారు. - ఈనాడు, నిజామాబాద్

బోధన్‌లో సద్దుల సంబురం

బోధన్ పట్టణంలో సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం నిర్వహించారు. తట్టికోట, పాన్‌గల్లీ, హరిజనవాడ, అంబేడ్కర్‌కాలనీ, బ్రాహ్మణగల్లీ, ద్యాకంగల్లీ, రాకాసిపేట్, బురుడుగల్లీల్లో మహిళలు పాల్గొన్నారు. పూలతో పేర్చిన బతుకమ్మలను వాకిట్లో పెట్టి ఆడారు. అనంతరం కూడలి వద్దకు అందరూ కలిసి సామూహికంగా బతుకమ్మ ఆడి నిమజ్జనానికి తరలించారు. - ఈనాడు - నిజామాబాద్, న్యూస్‌టుడే, బోధన్




వివిధ పూలతో తయారు చేసిన పెద్ద బతుకమ్మ : బోధన్ సరస్వతి నగర్ ప్రధాన కూడలిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

టీపీసీసీ చీఫ్ రాక నేడు

పాత కలెక్టర్ మైదానంలో బహిరంగ సభ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి శుక్రవారం జిల్లాకు వస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణుతో కలిసి జిల్లా కేంద్రంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 1 గంటకు మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. 1.30కు బోర్గాం(పి) వంతెన నుంచి ర్యాలీ ప్రారంభమై వినాయక్‌నగర్, ఫులాంగ్ చౌరస్తా, వంశీ హోటల్, ఎల్లమ్మగుట్ట చౌరస్తా మీదుగా పాత కలెక్టరేట్ మైదానానికి చేరుకుంటారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారు వాహనాలు నిలిపేందుకు పాత ఎంపీడీవో కార్యాలయం, ఎల్లమ్మగుట్ట చౌరస్తాలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీ, సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు రత్నాకర్, జావిద్, విక్కీ, విపుల్, వేణురాజ్, గంగారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

దామోదర రాజనర్సింహా హాజరు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సన్మాన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హాజరుకానున్నారు. పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహిస్తున్న సభలో ప్రసంగిస్తారు.




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, చిత్రంలో తాహెర్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, కేశ వేణు తదితరులు : సిద్ధమవుతున్న వేదిక


యోగా సాధకులతో సంఘం అధ్యక్షుడు రాంచందర్, ప్రతినిధులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే ఐదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల యోగా పోటీలకు జిల్లా యోగా సాధకులు బయలుదేరారని యోగాసన స్పోర్ట్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు యోగా రాంచందర్ తెలిపారు. తమ కార్యాలయం నుంచి 23 మంది యోగా సాధకులు గురువారం వెళ్లారని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి సంగీత, కోశాధికారి భూమాగౌడ్, సభ్యులు జ్యోతి, రఘుపతి, యోగాచార్యులు ప్రభాకర్ పాల్గొన్నారు.

● **సబ్ జూనియర్: బాలురు:** సృజన్ కుమార్, లక్ష్మీనారాయణ, వర్షిత్, కార్తిక్, ఓంకార్ సాయిరామ్, మణివర్ధన్
బాలికలు: తనయ నాలె, పవిత్ర, శ్రుతి, వర్షిత, సహస్ర
● **జూనియర్: బాలురు:** విశాల్, తరుణ్, కపిల్, తేజస్
బాలికలు: అసిత, నిర్మల, గీతిక, హాసిని, త్రివేణి, లక్ష్మీస్


జిల్లా జట్టుతో సంఘం ప్రధానకార్యదర్శి శ్యామ్

బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఖరారు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి జిల్లా జట్టు ఖరారైందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధానకార్యదర్శి శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు: సాయిశివ, ఉదయ్, మొగలాజి, శివమహేశ్, పండరి, దీక్షిత్, సాయినాథ్, హర్షిత్, అశ్వంత్, సాయికుమార్

క్రీడా పోటీలకు ఎంపికలు పూర్తి

నిజామాబాద్ క్రీడావిభాగం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు పూర్తయ్యాయని పీడీ కె.ప్రసాద్ తెలిపారు. నగరంలోని రాజారాం స్టేడియంలో గురువారం ఎంపికలు నిర్వహించారు.


ఎంపికైన క్రీడాకారులతో పీడీ కె.ప్రసాద్

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం సాంపల్లిలో చేపట్టిన సర్వేను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ ప్రభాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి నంబరు, చిరునామా, కుటుంబ యజమానితో గల సంబంధం వంటి వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. సర్వేను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వెంట ఆర్డీవో రాజా గౌడ్, అధికారులున్నారు.


డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు

నేటి నుంచి రోడ్డుపైకి ఎలక్ట్రికల్ బస్సులు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. మొత్తంగా 64 బస్సులకుగాను మొదటి విడత 13 వచ్చాయి. ఇటీవల ప్రారంభానికి ఏర్పాట్లు చేసినా అనివార్యకారణాల వల్ల ప్రారంభోత్సవం నిలిచిపోయింది. శుక్రవారం నుంచి తిప్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం జానీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నిజామాబాద్ ప్రధాన బస్టాండులో మంత్రి పొన్నం ప్రభాకర్ వీటిని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మొదట జేబీఎస్-నిజామాబాద్ మార్గంలో నడుపుతామని, ఛార్జీలు పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.230 ఉంటాయన్నారు.




ర్యాలీలో ఎఫ్ఆర్వో రవిమోహన్‌భట్, అధికారులు

వన్యప్రాణి వారోత్సవాలు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ఇందల్‌వాయి మండల కేంద్రంలోని అటవీక్షేత్ర కార్యాలయం వద్ద ఎఫ్ఆర్వో రవి మోహన్‌భట్ గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం క్షేత్రపరిధిలోని సిరికొండ మండలం కొండాపూర్‌లో గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వాటికి హాని కలిగిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

5 లోపు హాజరుకాకుంటే అనర్హులే

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని, లేదంటే అనర్హులుగా పరిగణిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి/ఈమెయిల్‌కి ఇదివరకే సమాచారం పంపినట్లు చెప్పారు. గురువారం నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు 410 మంది హాజరైనట్లు వెల్లడించారు.


ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ వ్యవసాయం : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం గురువారం కొలువుదీరింది. ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్ ఛైర్మన్ రాంచందర్ డైరెక్టర్లతో కలిసి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఛైర్మన్ భరోసా ఇచ్చారు.


నూతన పాలకవర్గంతో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి

పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్ సూచించారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలోని మిషన్ భగీరథ నీటిశుద్ధి ప్లాంట్‌లో గురువారం గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. లీకేజీలు లేకుండా చూడాలన్నారు. భగీరథ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈఈ నరేష్, డీఈ గంగారాం, డీఈ(గ్రిడ్) శివ, ఏఈ మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీవో యూసఫ్‌ఖాన్, శిక్షకులు లక్ష్మీనారాయణ, గోపి, సాయన్న, మధు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ రాజేంద్రకుమార్


ఆధారాలు ఎలా సేకరించాలో తెలుసుకుంటున్న అధికారులు, సీఐలు

సామర్థ్యాల పెంపునకు పోటీలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో సామర్థ్యం పెంచడానికి పోటీలు నిర్వహించినట్లు అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు తెలిపారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్‌లో గురువారం బాసర జోన్(నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్) కానిస్టేబుల్, సీఐ స్థాయి వారికి పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా వివిధ పోటీలు నిర్వహించారు. నేర సమాచారం కోసం ఆధారాలు ఏ విధంగా సేకరిస్తారనే అంశాలపై ఎంపిక పరీక్షలు జరిపారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు పంపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) శంకర్‌నాయక్, సీసీఎస్ ఏసీపీ నాగవేంద్రచారి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ నాగమోహన్, సీఐలు సురేశ్, శివరామ్, ముఖీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

In the court of Hon'ble District Judge, Nizamabad as. I.A. No. 1206 of 2024 in OS No. 6/24, Dt. 23-09-2024 and the Hon'ble court granted status quo order on OS 06/2024.

SCHEDULE OF PROPERTIES :

1. Agricultural Land Extent of Ac. 0-1275, Guntas in Sy. No. 415/E/2/1/1 And The Extent Ac 0-0850 Guntas Lies in Dichpally Shivar Village & Mandal Dichpally, Dist. Nizamabad **(BESIDE NAMASTE TELANGANA NEWS PAPER OFFICE)** Doc. No. 517/2024 (Registered @ Tahsildar Office Dichpally) in The Name of **MANDA AKSHAY REDDY S/O. ADVOCATE MANDA PRAKASH REDDY,** R/o. Nizamabad.
2. Plot No. 01, Extent 222.22 Sq. Yds., Lies in Sy. No. 429/A & 429, of Dichpally Shivar Nizamabad. Doc. No. 5529/2024 in The Name of **Sri MOHD HABEEB, S/O. MOHD MASOOD,** R/o. Nizamabad.
3. Plot No. 30 Extent 240.00 Sq. Yds Lies in Sy. No. 306/P1 of Kanteshwar Shivar (GREEN PARK VENTURE) OPPOSITE GANGASTHAN, NIZAMABAD. Doc. No. 4048/1999 In the Name of Smt. SHAHEEN SULTANA, W/o. LATE RAHIMODIN.

The public is strongly advised not to enter into any agreements or transactions involving Above mentioned properties.

For Further Information, Please Contact

My Client : Mohammed Moiz Uddin, contact No. 77026 01346

Sd/- **PALNATY SHYAM RATAN,** B.Com., LL.M., **ADVOCATE**
H.No. 11-2-345/2, Christian Colony, Kanteshwar,
NIZAMABAD - 503 002 (T.G.) Cell : 9573519327

చరవాణుల రికవరీ

కామారెడ్డి నేరవిభాగం: జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న రూ.20 లక్షల విలువైన 152 చరవాణులను ప్రత్యేక పోలీసుల బృందం నెల రోజుల్లోనే రికవరీ చేసిందని జిల్లా ఎస్పీ సింధూశర్మ చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చరవాణుల రికవరీ మేళాలో పాల్గొన్న ఆమె మాట్లాడారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

అధిక శబ్దం ఆరోగ్యానికి హానికరం

ఇందూరు సిటీ : డీజేల నుంచి వెలువడే శబ్దం ఆరోగ్యానికి హానికరమని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని కొత్త అంబేడ్కర్ భవన్‌లో గురువారం సౌండ్ సిస్టమ్ అద్దెకిచ్చేవారు, విక్రయించేవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డీజేలున్నవారు తప్పనిసరిగా సీపీ వద్ద లైసెన్సు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ ఏసీపీ నుంచి అనుమతి ఉన్న ఫంక్షన్లకు మాత్రమే సౌండ్ సిస్టమ్ కిరాయికి ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాక్సర్ నిఖత్‌కు డీఎస్పీ కొలువు



ఈనాడు, హైదరాబాద్: ఎల్బీ స్టేడియంలో సీఎం కప్ పోటీలను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాక్సింగ్‌లో రాణిస్తున్న నిఖత్ జరీన్‌ను రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీగా నియమించి బాధ్యతలు అప్పగించింది. ఆమె సీఎంతో కలిసి పోలీసు యూనిఫాంలో ఫొటో దిగారు.







గిరిరాజ్ కళాశాలలో.. : బోధన్ పాన్‌గల్లీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు : సరస్వతీనగర్‌లో..



సాలూరలో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

న్యూస్‌టుడే బృందం : నగర ప్రజలు గురువారం అటుకుల బతుకమ్మను భక్తితో పూజించారు. ఆలయాలు, అమ్మవారి మండపాలు, కళాశాలలు, అపార్ట్‌మెంట్లలో అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడి ఆడారు. బోధన్ పట్టణం, రాణాకలాన్, ధర్మారంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బోధన్ ఉమ్మడి మండలంలోనూ వేడుకల జరిపారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఇంటి వద్ద, ప్రధాన కూడళ్ల సామూహికంగా ఆడారు. అనంతరం స్థానిక జలవనరుల్లో నిమజ్జనం చేశారు.





కొడిచర్లలో : రాణాకలాన్‌లో..



బోధన్ : ద్యాకంగల్లీలో..





బోధన్‌లో నిమజ్జనానికి తీసుకెళుతున్న మహిళలు : బోధన్ గ్రామీణం : హున్సాలో..

పాముకాటుతో వృద్ధురాలి మృతి

బోధన్ గ్రామీణం : వృద్ధురాలిని పాము కాటేయడంతో మృతిచెందిన ఘటన తగ్గెల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగుబాయి (68) సొంత చేనులో సోయా కోస్తుండగా కాలికి పాముకాటు వేయడంతో స్పృహ తప్పి పడిపోయారు. కుటుంబీకులు బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించగా అప్పటికే మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కొడుకులుఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఏఎస్సై రవీందర్ తెలిపారు.

హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యం

మూసాపేట : లోధా టవర్స్ సమీపంలోని ఉదాసీన్ మఠానికి చెందిన నిర్మానుష్య ప్రదేశంలో హత్యకు గురైన మహిళ ఆచూకీని కూకట్‌పల్లి పోలీసులు కనుగొన్నారు. బోధన్ మండలానికి చెందిన ప్రియాంక(30)గా నిర్ధారించారు. రెండేళ్లుగా భర్తతో విడిపోయి సొంతూరులోనే ఉంటున్న ఆమెకు కుమార్తె ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధి కోసం 2 నెలల కిందట నగరానికి ఒంటరిగా వచ్చిన ఆమె కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ కింద ఉన్న పాదచారుల మార్గంపైనే నిద్రపోయేవారని సమాచారం. స్థానికంగా ఉండే గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఉదాసీన్ మఠం స్థలానికి తీసుకెళ్లి హత్య చేశాడు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. రెండురోజుల్లో వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రేమికులను బెదిరించిన ఇద్దరిపై కేసు

నవీపేట : ప్రేమజంటపై ఇద్దరు యువకులు బెదిరింపులకు పాల్పడిన ఘటన నవీపేటలో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన యువతి (21), యువకుడు (22) ద్విచక్రవాహనంపై బుధవారం బాసర వెళ్లేందుకు బయల్దేరారు. నవీపేట శివారులోకి రాగానే సదరు ప్రేమజంట కొద్దిసేపు రోడ్డు పక్కన ఆగారు. అటుగా వెళ్తున్న ఇద్దరు యువకులు ప్రేమికుల ఫొటోలు తీశారు. డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేస్తామని బెదిరించారు. అనంతరం యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రేమికులు ఠాణాకు వచ్చి జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన వారు బెదిరింపులకు పాల్పడిన వారు నవీపేటకు చెందిన ఇద్దరు యువకులుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై..

మోపాల్ : కులాస్‌పూర్ తండా అటవీ ప్రాంతంలో విధులకు ఆటంకం కలిగించిన స్థానికులు 11మందిపై సెక్షన్ అధికారి సాయికుమార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు. అటవీ ప్రాంతంలో దున్నడానికి యత్నిస్తున్న కొందరి కదలికలు గమనిస్తున్న సిబ్బంది రవి, దేవిదాస్‌లను బుధవారం రాత్రి స్థానికులు నిర్బంధించగా.. పోలీసుల సహకారంతో కులాస్‌పూర్ తండాకు వెళ్లి ఇద్దరిని విడిపించుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై..

ఎడపల్లి : అంబంగ్రామానికి చెందిన ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద బుధవారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఠాణాలో పరస్పరం ఫిర్యాదు చేసుకోగా..ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

బోధన్ గ్రామీణం : బోధన్ శివారులోని బొర్రగణపతి ఆలయ గేటు తాళాన్ని బుధవారం అర్ధరాత్రి దుండగులు పగుల గొడుతుండగా స్థానికులు గమనించి వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఇద్దరు పారిపోగా ఒకరిని పట్టుకొని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలిని ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ గురువారం సందర్శించారు. దీనిపై ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. స్థానికుల డిమాండ్ మేరకు పక్కాగా పెట్రోలింగ్ చేపడతామని సీఐ చెప్పారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

కోటగిరి : మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని ఆర్ఐ సయ్యద్ పట్టుకున్నారు. బుధవారం రాత్రి అనుమతులు లేకుండా పొతంగల్ నుంచి ఇసుకతో వస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

దివ్యాంగుడి అదృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం : మూడో ఠాణా పరిధిలో గురువారం దివ్యాంగుడి అదృశ్యం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని పవన్‌నగర్‌లో నివాసం ఉంటున్న నరేశ్(35) గత నెల 30న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు.



ఆగిన గూడ్స్ రైలు.. నిలిచిన ట్రాఫిక్

డిచ్‌పల్లి-ఘన్‌పూర్ రైల్వేగేటు మధ్యలో సాంకేతిక కారణాలతో గురువారం రాత్రి గూడ్స్ రైలు ఆగిపోయింది. రైలు వస్తోందని అంతకుముందే గేటు వేయడంతో అప్పటికే అక్కడ వాహనాలు నిలిచిపోయాయి. సాంకేతిక కారణంతో రైలు ఆగిపోవడంతో మరికొంత ఆలస్యమై దాదాపు 32 నిమిషాలు గేటు వేసి ఉంచారు. ఇరువైపులా ట్రాఫిక్ నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదివరకు కూడా ఇలానే గేటు మధ్యలో గూడ్స్ రైలు నిలిచిందని ప్రజలు తెలిపారు. **- న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం**

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

ఇంటి నంబర్లు కేటాయించాలని డిమాండ్

ఆర్మూర్ పట్టణం: ధనవంతులు ఇళ్లు కట్టకపోయినా ఇంటి నంబర్లు ఇచ్చారని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఆరోపించారు. గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో బల్దియా కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. యానంగుట్ట దగ్గర నివాసముంటున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంకటేశ్, ఎల్లయ్య, రవి, భూమన్న, సాయిలు, ఓంకార్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

వరద కాల్వకు నీటి విడుదల నిలిపివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం వరద కాల్వ ద్వారా గురువారం ఉదయం 11.22 గంటలకు నీటి విడుదల నిలిపివేసినట్లు ఏఈఈ కొత్త రవి తెలిపారు. జలాశయంలోకి ఎగువ నుంచి వరద చేరిక 8525 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. కాకతీయ కాల్వ ద్వారా 6800, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231, గుత్ప ఎత్తిపోతలకు 135 క్యూసెక్కులు వదులుతున్నామన్నారు.


వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్

వివరాలు పక్కాగా నమోదు చేయాలి


ఆర్మూర్‌లో సర్వేలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, పుర ఛైర్‌పర్సన్ లావణ్య


ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో కుటుంబాలకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డులో పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్డు భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతోందన్నారు. అర్హులైన వారికి పథకాలు అందుతాయన్నారు. ఆయన వెంట పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, పుర కమిషనర్ రాజు, వైస్ ఛైర్మన్ మున్ను, కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఖాందేశ్ శ్రీనివాస్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువ శబ్దాలతో డీజేలు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. భీమ్‌గల్ పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో భీమ్‌గల్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలకు చెందిన డీజే నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. శబ్దస్థాయి పెంచడంతో ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. నిర్ణీత ధ్వనితో నిర్వహిస్తామని ఏసీపీ కార్యాలయం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగం నిషేధమని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సమావేశంలో భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు మహేష్, రాము, అనిల్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పురిటి నొప్పులు..!!



ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి పేరు చెబితే అందరికి ముందుగా గుర్తుకువచ్చేది ఇక్కడ జరిగే ప్రసవాల గురించే అంటే అతిశయోక్తి కాదు. జిల్లా ఆసుపత్రి తర్వాత ఇక్కడ అత్యధికంగా ప్రసవాలు చేసేవారు. ఒక నెలలో సీహెచ్‌సీ స్థాయిలో 333, వైద్య విధాన పరిషత్ అధీనంలోకి వచ్చాక 308 ప్రసవాలు జరిగాయి. ఇప్పుడు రెండు వందలు కూడా దాటడం లేదు. వైద్య విధాన పరిషత్ అధీనంలోకి వచ్చాక 300 ప్రసవాలు చేయాలన్న లక్ష్యం విధించింది. 2022లో నవంబరులో లక్ష్యాన్ని చేరుకోగా.. ప్రస్తుతం ఆ రికార్డుకు చాలా దూరంలోనే ఉంది. దీనికి గల కారణాలపై ఉన్నతాధికారులు ఆరా తీసి, సమస్యలు తీర్చి ప్రసవాలు పెంచితే పేదలకు నమ్మకం కలిగి ఇక్కడ వస్తారని ప్రజల వాదన.

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

గర్భిణులుగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ కేంద్రాల్లో నమోదైన నాటి నుంచి ఆశాలు వైద్య పరీక్షల కోసం ప్రతినెలా ఆసుపత్రికి తీసుకొస్తారు. ప్రసవం అయ్యే వరకు ఏఎన్ఎం, ఆశాలు బాధ్యత తీసుకొంటారు. గతంలో హైరింగ్ చేసుకొని అనస్తీషియా, గైనకాలజిస్ట్‌తో ఆసుపత్రికి వచ్చిన ఏ ఒక్కరిని తిరిగి పంపించకుండా ప్రసవాలు చేసేవారు. ఇలా హైరింగ్ ద్వారా సేవలందించిన వారికి రూ.2500 ప్రభుత్వం చెల్లించేది. ప్రస్తుతం ఈ సౌకర్యం లేకపోవడంతోనే ప్రసవాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో అత్యవసర సేవల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే అనస్తీషియా వైద్యులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈ సమస్య గ్రామాల్లోకి విస్తరించడంతో ప్రసవాల సంఖ్యపై తీవ్ర ప్రభావం పడింది.



జీజీహెచ్‌కు సిఫార్సు..

సాధారణ ప్రసవాలను మినహాయిస్తే శస్త్రచికిత్సల కోసం అత్యవసరంగా వస్తే అనస్తీషియా వైద్యులు లేకపోవడంతో జిల్లా ప్రభుత్వాసుపత్రికే సిఫార్సు చేయాల్సి వస్తోంది. ఇక్కడకు వస్తున్న 180 కేసుల్లో 20-30 అత్యవసరమైనవే ఉండడంతో జీజీహెచ్‌కు పంపిస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు గైనకాజిస్టులకు, 1 అనస్తీషియా వైద్యుడు మాత్రమే ఉన్నారు. అదనంగా మరొకరిని నియమిస్తే పరిస్థితి మెరుగుపడే అవకాశముంది.

సేవలు మెరుగుపరుస్తాం

ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రిలో సేవలను మెరుగుపరుస్తాం. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గర్భిణులను వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. ఇటీవల మరో అనస్తీషియా వైద్యుడిని నియమించారు. ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. ఆయన విధుల్లో చేరితే ప్రసవాల సంఖ్య మరింత పెరుగుతుంది.

డా.రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్మూర్

చల్లని ప్రయాణం

మోర్తాడ్ మండలం పాలెం నుంచి ఏర్గట్ల మండలం తొర్తి వైపు వెళ్లే మార్గంలో పాలెం శివారులో ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లు దట్టంగా ఉండి ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ఈ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు ఇక్కడకు రాగానే ఆగి కాసేపు సేద తీరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పంటపొలాలు ఉండడంతో మరింత ఆహ్లాదకరంగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఏర్గట్ల



మద్యం పట్టివేత

ముప్కాల్: మండల కేంద్రంలో గాంధీ జయంతి రోజున ఓ మహిళ ఇంట్లో అక్రమంగా కల్లు అమ్ముతుంటే స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. సుమారు 25 లీటర్లు ఉన్నట్లు గుర్తించి ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించామన్నారు.

న్యాయం చేయాలి

ఆర్మూర్ పట్టణం: సహారా ఖాతాదారులకు రావాల్సిన నగదు చెల్లించాలని బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పూజిత అన్నారు. ఖాతాదారులను ఉద్దేశించి గురువారం ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తెస్తున్నా డబ్బులు చెల్లించకుండా కాలాయాపన చేస్తోందన్నారు. దాసు, నరేందర్, నర్సయ్య, నారాగౌడ్, రమేశ్, గంగాధర్, భూమేష్, సాయిలు, వేణుగౌడ్, రవి, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో..


ఆర్మూర్ ధనలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ


కమ్మర్‌పల్లిలో శోభాయాత్రగా మండపానికి తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


వెల్మల్‌లో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు
ఏర్గట్ల మండల కేంద్రంలో...
మామిడిపల్లిలో..
హౌసింగ్ బోర్డులో పూజలందుకొంటున్న దేవీ
బాల్కొండలో పూజలందుకున్న నిమిషాంభ దేవీ

ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పల్లెలు, పట్టణాల్లో ముస్తాబు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాల్లో ప్రతిమలను అందంగా అలంకరించారు. భక్తుల తరలివెళ్లి పూజలు చేశారు.

– న్యూస్‌టుడే బృందం

పచ్చదనం కాదు.. ప్రమాదం



మోర్తాడ్ మండలంలోని పాలెంలో ప్రకృతి వనంలో కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి. వీటిని నాటొద్దని గతంలో ప్రభుత్వం హెచ్చరించింది. అయినా కొన్ని చోట్ల వీటిని తొలగించలేదు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సంతోశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తొలగిస్తామని వెల్లడించారు.

– న్యూస్‌టుడే, మోర్తాడ్

సర్వే పరిశీలన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మండలం రాంపూర్‌లో గురువారం డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను అధికారులు నిర్వహించారు. ఆర్డీవో రాజాగౌడ్ సర్వే తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కుటుంబసభ్యుల వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎల్పీవో శివకృష్ణ, ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాంపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజాగౌడ్

భీమ్‌గల్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన భీమ్‌గల్ పట్టణంలోని ఏడో వార్డులో అధికారులు సర్వే నిర్వహించారు. ఎంపీడీవో సంతోష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రజలు అధికారులకు అన్ని వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


భీమ్‌గల్‌లో సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో సంతోష్

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం


ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలు కొంగి జమునకు గురువారం రూ. 44,500 నగదు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆమెకు ఆర్థికసాయం చేసి చేయూతనందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోషమ్మ, రజిత, కల్పన, భోజలత, వైదేహి, లక్ష్మీనారాయణ, అశోక్, సృజన్, నరహరి, రవి, నరేష్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘానికి విరాళం

ముప్కాల్: వేంపల్లి గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి నాయకుడు సంతోష్ ఫౌండేషన్ తరపున రూ.25 వేల నగదును సంఘ అధ్యక్షుడు దేవదాస్‌కి అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు వెంకట్ నర్సయ్య, భరత్‌రాజ్, శేఖర్, రాకేశ్, సంఘం సభ్యులు భూమన్న, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు రవళిక

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.రవళిక ఎస్‌జీఎఫ్ అండర్-17 తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ప్రసాద్, పీడీ ముత్తెన్న తెలిపారు. నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో గద్వాలలో జరుగనున్న పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.



కొనసాగుతున్న ఆందోళన

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రం ప్రధాన గేటు వద్ద జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు గురువారం ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. రామగుండం వద్ద నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రఫీక్, సతీష్, భరత్, శ్రీనివాస్, శ్రీకాంత్, ఏవీ శ్రీనివాస్, సురేష్‌కుమార్, వినోద్, నాగార్జున, రాందాస్, గంగారాం షిండె, ఈవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు

కాంగ్రెస్ నాయకుల సమావేశం

మాక్లూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్ గౌడ్, రవిప్రకాష్, సహకార సంఘం ఛైర్మన్ బూరొల్ల అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ గురువారం పర్యటించారు. ముఖ్యమైన కార్యకర్తలతో సమావేశమయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నిజామాబాద్‌కు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. భరత్, రాజేందర్, దయాకర్‌రావు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు మండలకేంద్రంలో గ్రామాభివృద్ధి నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బార్ల ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షులుగా నవనీత్, సంతోష్, కోశాధికారులుగా సుమన్, గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా జాన్, రాములు ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని ముత్యంరెడ్డి పేర్కొన్నారు.

ఆర్మూర్ పట్టణం: జంబి హనుమాన్ ఆలయ నూతన ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా రేగుల్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. డైరెక్టర్లు అల్లకొండ హరీష్, శ్రీనివాస్, రమణ, భోజన్న, మహేందర్, రవి, సుజాత, నారాయణరెడ్డి, కిషన్‌గౌడ్, ఖాందేశ్ సత్యం ఎన్నికయ్యారు. నూతన సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, సాయిబాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.